# శ్రీ వేంకటేశ శరణాగతి దీక్ష

**"వేంకటేశ సమోదేవో నాస్తి నాస్తి మహీతలే"!**

"ఈ భూమిమీద శ్రీవేంకటేశునితో సమానమైన దేవుడు లేడు! లేడ"ని వరాహపురాణము స్పష్టముగా ప్రకటించింది. యోగులకు, దేవతలకు కూడా అదృశ్యుడైన ఆ శ్రీమన్నారాయణుడు మనమీద దయచేత **"అర్చామూర్తి"**గ శ్రీవేంకటేశ్వరునిగా తిరుమల కొండపై వెలిసాడు. శరణన్న వారి భయములన్నింటినీ పారద్రోలి, సుఖశాంతులను ప్రసాదించు గోవిందుడితడు.

సర్వ జీవులకూ ఈ శ్రీనివాసుడే ఆధారము. మనమందరమూ ఆయన సొత్తు. ఆయనకు విధేయులమై ఆయనకు ప్రీతి కలుగునట్లుగా సకల జీవులకు సేవలు చేయుట మనవిధి. ఆయన యజమాని. మనము సేవకులము. ఆయన అనుగ్రహించువాడు. ఆ అనుగ్రహమును పొందవలసిన దాసులము మనము.

ఈ సత్యమును, సంబంధమును గుర్తించుటయే జ్ఞానము. అదే ప్రకాశము. ఇది తెలియకపోవుటయే అజ్ఞానము. అదియే తమస్సు. అదియే చీకటి. ఈ అజ్ఞానాంధకారము ఆవరించి, స్వతంత్రులమని విఱ్ఱవీగు అహంకారులు **"దేహ గృహము"**పై మమకారముతో విషయభోగవ్రతములను ఆచరించుచున్నారు. జన్మ పునర్జన్మల చక్రభ్రమణమున చిక్కి దుఃఖ, నాశనములను ఫలములుగా పొందుచున్నారు.

ఈ దురవస్థనుండి మనలను కాపాడుటకై పరమహంస పరివ్రాజకా చార్యులు, జగద్గురువులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వామివారు **"శ్రీవేంకటేశ శరణాగతి దీక్ష"**ను మనకు అనుగ్రహించు చున్నారు.

ఆ ఏడు కొండలవాడి దివ్యానుగ్రహముతో మనం తరించు విధంగా "ఏడు వారాల దీక్ష"గా శ్రీ స్వామివారు మనకు అందజేయుచున్నారు. కలియుగ దైవమైన శ్రీవేంకటేశుని శరణువేడి జీవితమును చరితార్థము చేసుకొనుటకిది అపురూపమైన అవకాశము.

**"ఓం నమో వేంకటేశాయ"!**- అను మంగళకరమైన అష్టాక్షరీ మంత్రమును తాళిగా స్వీకరించి, మాధవుని భర్తగా చేసుకొని ఉజ్జీవించు శరణాగతి వ్రతమిది!

ఆ **"శ్రీవేంకటేశుడే"** మనకు పతి. మనకు రక్షకుడు. పోషకుడు. ఆ శ్రియఃపతి యెడల మన విధేయత సర్వకాల సర్వావస్థల యందు చెక్కుచెదరక నిలుపమని వేడుతూ **"శరణాగతి దీక్ష"** పూనెదము. కదలిరండు.

ఆ నారాయణుడు నీకు, నాకే కాదు. ఎల్లరకు, ఎల్లలోకములకు అధిపతి. అంతటా వ్యాపించి ఉన్న ఆ దివ్యతత్త్వపు మహిమను కొనియాడు **"శరణాగతి దీక్ష"**ను స్వీకరించెదము. రండి! తరలిరండి.

"స్వామీ! నీవు మావాడవు. మేము నీవార"మని దిక్కులు ప్రతిధ్వనించు నట్లుగా శ్రీవేంకటేశ్వర శరణాగతి దీక్షను చేపట్టెదము. చరచరా కదలిరండు! తరించుటకు,





తరింపచేయుటకు తగిన దివ్యానుభూతియందు మునకలు వేయుటకు "శ్రీ వేంకటేశ శరణాగతి దీక్ష"ను స్వీకరించెదము. బిరబిరా ఉఱికిరండు.

## శ్రీవేంకటేశ్వర శరణాగతి దీక్షాక్రమము:-

**1. ఏడు వారముల వ్రతము:-**

**"శ్రీవేంకటేశ శరణాగతి దీక్ష"**ను ఏడు వారముల వ్రతముగా ధనుర్మాస ఆరంభము నుండి మొదలు పెట్టి మాఘపూర్ణిమతో ముగిస్తాము. ఏడు వారముల అనంతరము దీక్షాధారులు ఏడు కొండలకు విచ్చేసి, స్వామిని దర్శించి దీక్షను విరమించవచ్చును. అవకాశం లేనివారు తమ తమ అభిమతస్థానములలో దీక్ష విరమించవచ్చు. స్త్రీలు తమ ఋతు సంబంధమైన సమయపాలనముగా నాలుగు దినములను వదలి దీక్షను కొనసాగించవలె.

**2. పసుపు బట్టలు / తెల్ల బట్టలు:-**

శ్రీవేంకటేశుని పతిగా స్వీకరించి, శరణు వేడుచున్న ఈ దీక్షాకాలము మనకు ఎంతో మంగళ ప్రదమైనది. నూతన వధువులము మనము. వరుడు వేంకటేశుడు. ఈ సంబంధమును గుర్తు చేయుటకై పసుపు బట్టలను దీక్షా సమయమున శరణాగతి చేసినవారు ధరించుట నియమము. అనువుకానివారు సాత్విక శక్తికై ప్రార్థిస్తూ తెల్లబట్టలు ధరించవచ్చును.

**3. తులసిమాల, హనుమంతుని రూపు:-**

**"శ్రీవేంకటేశ శరణాగతి దీక్ష"**ను స్వీకరించిన భక్తులు స్వామికి ప్రీతికరముగా తులసి మాలను, నిష్కల్మషమైన సేవకు సంకేతమైన హనుమ రూపును మెడలో ధరించవలెను.

**4. దీక్షను ఇచ్చువారి యోగ్యత:-**

మాధవునిమీది ప్రీతితో మద్యమాంసాది తామసాహారమునకు దూరముగా ఉంటూ, సద్వర్తనులై జీవించు శ్రీవేంకటేశుని భక్తులెవరైననూ, వారి జాతితో నిమిత్తము లేకుండా **"శ్రీవేంకటేశ శరణాగతి దీక్ష"**ను కోరిన భక్తులందరికీ అందజేయవచ్చును. భక్తులు తమ మాతృమూర్తి ద్వారా అయినా దీక్షను స్వీకరించవచ్చు.

**5. "శ్రీవేంకటేశ కలశ" స్థాపన:-**

**"శ్రీవేంకటేశ శరణాగతి దీక్ష"**ను స్వీకరించిన భక్తులు తమ గృహంలో "ఓం నమో వేంకటేశాయ" నామము, శంఖ, చక్రములు, తిరునామములతో కూడిన మృణ్మయ కలశమును (మట్టిపాత్రను) "శ్రీవేంకటేశ కలశము"గా ఏర్పరచుకొనవలెను. ఈ వేంకటేశ్వరస్వామి వారి పటముతో సహా ఈ **"కలశము"**ను తమ పూజా మందిరమున ప్రతిష్ఠించుకొనవలెను. కలశమును సమష్టిగా కూడా ప్రతిష్ఠించుకొనవచ్చును.

**6. "కలశ " నిమజ్జనం:-**

దీక్ష విరమణ అనంతరం కలశమునకు ఉద్వాసన చెప్పి నిమజ్జనము చేయవలెను.

**7. "ఓం నమో వేంకటేశాయ" నామలేఖనం, సంకీర్తనం, గణనం:-**

యథాశక్తి **"ఓం నమో వేంకటేశాయ"** నామ లేఖనాన్ని ప్రతిరోజూ కొనసాగించవలెను. నామమును వ్రాయుటకు అశక్తులైన వారు నామమును పలుకుతూ

బియ్యపుగింజలను లెక్కించి "కలశము'నకు సమర్పించవలెను. శ్రద్ధగా నామమును సంకీర్తనము చేయవలెను.

**8. శనివారపు ఆరాధన:-**

ఎ). శ్రీవేంకటేశుని భక్తులందరూ కలిసి కనీసము వారమునకు ఒక్కరోజు, శనివారమునాడు **"సామూహిక ఆరాధన"**ను చేయవలెను. శ్రీ స్వామివారి పటముతో, కలశముతో ప్రతిరోజు ఉదయమున **"నగర సంకీర్తనము"** చేయవలెను.

బి). నగర సంకీర్తన సమయమున భక్తుల గృహముల నుండి **"ఓం నమో వేంకటేశాయ"** నామము పలుకుతూ సమర్పించిన బియ్యపు గింజలను సేకరించవచ్చును.

సి). సామూహికంగా కలశాన్ని ఏర్పరచుకొన్నప్పుడు, భక్తులు ఉదయం పూట నగర సంకీర్తనం చేసి, సాయంత్రం పూట ఒక్కొక్క రోజు ఒక్కొక్క భక్తుని ఇంట "కలశ"పూజ చేయవచ్చును. నామలేఖనము కూడా సామూహికంగా చేయవచ్చును.

డి). దీక్షాధారులైన భక్తులు తమ ఇంటి వద్దకానీ, అందరికీ యోగ్యమైన సమావేశ స్థలమునందు గాని ఇతర భక్తులందరూ కలసి సాయంత్రం వేళలలో స్వామిని ఆరాధించవలెను.

ఇ). భగవన్నామాంకితమైన బియ్యపుగింజలతో తయారు చేసిన ప్రసాదమును స్వామికి నివేదించి, భక్తులకు వితరణ చేయవచ్చును. అవకాశం లేని సమయాలలో పటికబెల్లం, పండ్లువంటి ప్రసాదము కూడా ఇవ్వవచ్చును. ప్రసాదం విషయంలో అతివ్యయం పనికిరాదు.

ఎఫ్). శ్రీ వేంకటేశ శరణాగతి ప్రార్థన, అష్టోత్తరపూజ, శ్రీ వేంకటేశ మాహాత్మ్య కథాశ్రవణము, భజన, ప్రసాద వితరణము కార్యక్రమములో భాగములు.

జి). మన 'శరణాగతి దీక్ష' కు ఆటంకము కలుగకుండా, మనలను రక్షించి, దీక్ష సఫలమగు దారి చూపవలసినదిగా హనుమంతుని ప్రార్థించుట ఆరాధన మొదలు, చివర కూడా చేయవలెను. ప్రార్థన చివరి పేజీలో కలదు.

**9). ఆహారము:-** దీక్షా సమయంలో భగవన్నివేదితమైన సాత్వికాహారమును ఒక పూట స్వీకరించుట ఉచితము. బాలురకు, వృద్ధులకు, గర్భిణులకు, రోగగ్రస్తులకు ఉపవాస నియమము అవసరము లేదు.

**10). విడువదగినవి:-** దీక్షా సమయమున పాన్‌పరాగ్, గుట్కా, మద్యపానం, మాంసాహారం, పొగత్రాగటం వంటి విడువదగిన అలవాట్లకు దూరంగా ఉండవలెను.

**11). శ్రీ వేంకటేశ శరణాగతి పఠనము:-** దీక్షాధారులు శ్రీవేంకటేశ్వర స్వామివారి యొక్క చరిత్రను వారమునకు ఒక భాగము చొప్పున ఏడు వారములు అధ్యయనము చేయుటకు వీలుగా అందజేసిన శ్రీ వేంకటేశ శరణాగతి దీక్ష కథలను పఠించవలెను.

**------- ఓం నమో వేంకటేశాయ -------**





## ప్రార్థన

# శ్రీ వేంకటేశా! నీకు శరణు!!

1. ఆది నారాయణుడవై క్షీరసాగరమున పవళించిన శ్రీ వేంకటేశా! నీకు శరణు !
2. మత్స్య రూపధారుడవై వేదోద్ధరణ చేసి సృష్టిని కాచిన శ్రీవేంకటేశా! నీకు శరణు!
3. కూర్మరూపధరుడవై సాగరమథనాన్ని సఫలం చేసి లక్ష్మీపతివైన శ్రీవేంకటేశా! నీకు శరణు !
4. వరాహమూర్తివై పుడమిని పట్టి, వేంకటాద్రిపై నిలచిన శ్రీవేంకటేశా! నీకు శరణు!
5. ధన్వంతరివై ఓషధులిచ్చి మా భవరోగము బాపిన శ్రీవేంకటేశా! నీకు శరణు!
6. నరసింహుడవై బాలుని బ్రోచిన భక్తరక్షకా! శ్రీవేంకటేశా! నీకు శరణు!
7. వామనుడవై బలికీర్తిని చాటి ముల్లోకములను నీ పదమున చేర్చిన శ్రీవేంకటేశా! నీకు శరణు!
8. పరశురాముడవై దుర్మదాంధులకు బుద్ధిచెప్పిన శ్రీవేంకటేశా! నీకు శరణు!
9. శ్రీరాముడవై, మానవతకు ప్రతిరూపుడవై ధర్మరాజ్య మందించిన శ్రీవేంకటేశా! నీకు శరణు!
10. గీతాచార్యా! ధర్మోద్ధారా! యుగయుగాలకు ఆరాధ్యమూర్తీ! శ్రీవేంకటేశా! నీకు శరణు!
11. ఇన్ని చేసినా తనివి తీరక కలియుగ దైవమై అర్చామూర్తిగా, సప్తగిరులపై మమ్ము కాచుచూ నిలచిన శ్రీశా! నీకు శరణు!

శ్రీవేంకటేశా! నీకు శరణు

ప్రభో! నీకు శరణు! శరణు!

................. **ఓమ్ నమో వేంకటేశాయ!** ................

### శ్రీ వేంకటేశ శరణాగతి - 1

# క్రీడాద్రి వైభవం

**అహంకారమనే పెడమార్గం నుండి**
**పాపచింతనులైన జీవులను రక్షింపగా**
**పెక్కుమార్లు అవతరించిన శ్రీవేంకటేశా !**
**నీ దివ్య పాదములే మాకు శరణాగతి !**

**వినుట, కనుట, తినుట, త్రాగుట, తాకుట, ఆఘ్రాణించుట**
**వంటి విషయ సుఖముల భ్రాంతిలో మునిగి**
**వ్యధల భారముతో క్రుంగు దీనులమైన మాకు శ్రీవేంకటేశా!**
**నీ దివ్య పాదములే శరణాగతి !**

శ్రీ వేంకటేశా! నీవు పరమ పురుషుడవు. ఆశ్రితవత్సలుడవు. శరణన్నవారిని రక్షించు నీ దయాదీక్షకు హద్దులులేవు. అక్రూరవరదా! అజామిళవరదా! అంబరీష వరదా! అహల్యా వరదా! గజేంద్రవరదా! ధ్రువవరదా! ప్రహ్లాదవరదా! పాంచాలీ వరదా! ముచికుంద వరదా! నీకై నిత్యనిరంతర దాసత్వదీక్షను మాకనుగ్రహించు.

శ్రీనివాసా! మృత్యురూపమైన మా సంసారభయాన్ని నీ నామస్మరణం నాశనం చేస్తుంది. మేము నీ దాసులము. నీవు మా యజమానివి. బ్రహ్మరుద్రాది సమస్త దేవతలూ నీకు సేవకులే. అంతటి గొప్ప దాసులముందు మేము క్షుద్రాతి క్షుద్రులము. అయినను మమ్ము విస్మరింపక నీ లోకోత్తరమైన కరుణను మాపై ప్రసరింపచేయుచున్నావు.

హే! వేంకటరమణా! దురహంకారంతో వ్యర్థంగా జీవిస్తున్న మాకు, మాసిపోని ఎఱుకతోకూడిన నీ దాస్యమార్గమే దిక్కు. మాకు నీవెన్ని జన్మలిచ్చినా సరే! నీ యిష్టం. నిన్ను మరువక సేవించుబుద్ధిని మాత్రం మాకు అనుగ్రహించు.

గోవిందా! నాడు గొల్లవై గోవులను కాచి, గోవర్ధనగిరినెత్తి బ్రహ్మేంద్రాదుల గర్వమును ఛిద్రం చేసిన స్వామివి నీవు. ఇక మేమెంత? పొగరెత్తిన మా బ్రతుకెంత? నీ కనుచూపుకాంతిలో లవలేశము మాపై ప్రసరించిన చాలు. మా జీవితాలను కప్పిన పాపాల చీకటి చిటికలో మటుమాయమగును.

స్వామీ! నీ అనుగ్రహమహిమను వేదాలు కీర్తించాయి. ఇతిహాసాలు నీ దయను ప్రకటించాయి. పురాణాలు నీ ఘనతను చాటాయి. మహర్షులకు, దేవతలకు కూడ అగోచరుడవైన నీవు మాపై అవ్యాజ ప్రేమతో అర్చామూర్తిగా "శ్రీ వేంకటేశుని"వై తిరుమల కొండపై వేంచేసితివి.





ఓమ్ నమో వేంకటేశాయ! ఓమ్ నమో వేంకటేశాయ! ఓమ్ నమో వేంకటేశాయ! ఓమ్ నమో వేంకటేశాయ!

తిరుమలేశా! నీవు వెలిసిన నీ కొండ మహత్తును ఏమని కొనియాడగలము?

శ్రీశుకాది మహామునులు, భృగునివంటి తాపసులు, ప్రహ్లాదునివంటి భాగవతోత్తములు, అంబరీషునివంటి చక్రవర్తులు, నీవు ప్రీతితో విహరించుటకై వైకుంఠమునుండి భూమికి తరలివచ్చిన నీ క్రీడాద్రి పర్వతమిదియని, నీ కొరకు మ్రొక్కులిడుదురు.

సప్తగిరి నిలయా! స్వామిపుష్కరిణి వంటి అనేక పవిత్రతీర్థములతో, సువర్ణముఖరీ ప్రవాహములతో అలరారుతూ, ఆదిశేషుని రూపమై నిలచిన నీ తిరుమల భక్తులపాలిట నీవలె కల్పవృక్షం కదా!

"పర్వతరాజమా! సర్వలోకములకూ నీవు పూజనీయుడవు. మహాపుణ్యశాలివి. నీకు అనేక నమస్కారములు. మమ్ము తరింపచేయు శ్రీ వేంకటేశుడు నీపై కొలువున్నాడు. స్వామి దర్శనము కొఱకై నీపై కాలిడుతున్నందుకు మమ్ము మన్నించు. దయతో మా దోషములను విస్మరించి మాధవుని అనుగ్రహదృష్టిని మాపై ప్రసరింపచేయి" అని నీ కొండను ప్రార్థించుచూ, నిన్ను చేరవలెనని మమ్ము స్కందపురాణము శాసించె.

ఓ ఏడుకొండలవాడా! నీ అనుగ్రహాతిశయాన్ని పాశురాలలో గానంచేసిన పరమభక్తులు ఆళ్వార్లు, తరింపచేయడంలో నీవలె నీ కొండకున్న మహత్తుకు మంగళాశాసనం చేసి, నీ కొండను త్రొక్కుటయే అపచారమని భావించి క్రిందనుండియే నిన్ను కొలిచితిరి.

అయస్కాంత సంబంధము చేత తానును అవ్విధంబుగ మారిన ఇనుమువలె, నీ కొండను కూడిన కొండలన్నింటికీ నీ దివ్యమహిమ సొంతమాయె.

"స్వామీ! నీ కొండను చేరు దారిని తలచినా చాలు నిన్ను తలచిన పుణ్యము మాకబ్బునుకదా!

శ్రీ వేంకటేశా! నీ కొండపై నీటికోడిగానైనా, చేపపిల్లగానైనా పుట్టినచాలును. సంపంగి చెట్టుగానైనా, ముళ్ళమొక్కగానైనా సరే కొండమీద నిలిస్తే చాలును. బండగానో, వాగుగానో, కొండపైన ఉంటేచాలు. నలుగురు భక్తులూ నడిచేబాటగా మారినచాలు. నీ ముంగిట గుమ్మంగా పడిఉన్నా చాలు. జన్మధన్యమౌతుందని" ఆళ్వారులు చేసిన గానం మాకు సదాముక్తిమార్గాన్ని చూపే ధ్యానమే కదా!

ఓ అలమేలుమంగాపతీ! నీ కొండపైనున్న ప్రతి అణువూ నీ సేవలోనే తరిస్తున్నాయి. తొలిజాము కిరణాలలో స్నానమాడి నీ కొండపైనున్న మొక్కలు, లతలు తమ పూలను, పండ్లను నీ సేవకోసం సిద్ధం చేస్తున్నాయి. నీ పాదాలను అభిషేకించాలనే

ఓమ్ నమో వేంకటేశాయ! ఓమ్ నమో వేంకటేశాయ! ఓమ్ నమో వేంకటేశాయ! ఓమ్ నమో వేంకటేశాయ!

కోరికతో, నీ భక్తులమైన మమ్ము తరింపచేయాలనే ఆత్రముతో నీ కొండమీద పుణ్యతీర్థాలు, ప్రవాహాలు నిలిచి ఉన్నాయి. నీ కొండమీదున్న సమస్త ప్రకృతీ నీ సేవలో పులకరిస్తుంది.

వేంకటమన్నది ఈ పర్వతం. నీవు వేంకటేశ్వరుడవు. ఈ పర్వత సంబంధమే నీకీ పేరును తెచ్చింది. నీవు వేంచేయడం వల్ల ఈ పర్వతం మహిమాన్వితమైంది. ఈ పర్వతం మాకు పరత్వాన్ని సిద్ధింపచేసేది. సేవక వ్రత దీక్షను సదా మాకు గుర్తుచేసే నీ పర్వతరాజాన్ని ముందుగా మేము శరణువేడుతున్నాము.

ఓ అనాథరక్షకా! ఆర్తబంధూ! దుఃఖంతో, దైన్యంతో కృంగిపోయినవారికి, రోగులకు, భయస్తులకు దిగులుతో బ్రతుకురోతగా మారిన వారికి నీ కొండను చేరుదారినైననూ స్మరించిన మాత్రము చేతనే సుఖ, శ్రేయస్సులను ప్రసాదించు సంజీవనీ సహిత కల్పవృక్షమౌదువుకదా!

ఓ దేవదేవా! బ్రహ్మపురాణం, బ్రహ్మాండపురాణం, స్కందపురాణం, మార్కండేయపురాణం, వరాహపురాణం, పద్మపురాణం... ఇలా ఒకటా, రెండా! పదకొండు పురాణాలు నూటయాభై ఏడు అధ్యాయాలతో పదివేల ఏడువందల డెబ్భైయొక్క శ్లోకాలతో నీ కొండ మాహాత్మ్యాన్ని గానం చేసాయి.

తండ్రీ! ఇన్ని పురాణాలను పుక్కిటపట్టు శక్తిలేని వారము. మమ్ముబ్రోచుటకు నీవు తప్ప మరెవరూ దిక్కులేరని నమ్మినవారము. నీ పాదదాసులమై తరించవలెనను దీక్షను స్వీకరించిన వారము. ప్రసన్నుడవై మమ్ము అనుగ్రహించుము.

### శ్రీ వేంకటేశ శరణాగతి - 2

## బ్రహ్మనుండి కుమ్మరి దాకా!...

“శరణుజొచ్చిన వారందరికీ అభయమిచ్చెదనని దీక్ష” పట్టిన శ్రీవేంకటేశా! ఈ భూమిపై నీతో సమానమైన దైవము మరి ఇక ఎవ్వరూ లేరుకదా! భక్తితో కూడిన స్వల్పసమర్పణమునకైనా, అల్పపూజకైనా సంతసించి, ప్రసన్నుడవై కోరిన కోర్కెలను శీఘ్రముగా నెరవేర్చు నీ దయకు మేము నీరాజనం పలుకుతున్నాం.

స్వామీ! నీ వలన ఇష్టఫలములను పొంది తృప్తిచెందు నీ భక్తులను చూచి ఇతరులు కూడా నీ దాసులగుటకై త్వరపడుచున్నారు. మా కోర్కెలను నీవు వేగముగ





తీర్చుచున్నావను అసూయతో, తాముకూడా నీ అనుగ్రహమును పొందుటకై దేవతలు సైతము ‘నర’జన్మనెత్తుటకు తహతహలాడుచున్నారు.

వేంకటేశా! కలిదోషయుక్తులైన మాబోటి పాపకర్ములకు నీ పాదములకన్న శరణమింకేమున్నది? దేవసేనానియైన స్కందుడు తారకాసురవధవల్ల కలిగిన పాపవిముక్తికై, పరమశివుని ఆజ్ఞమేరకు, నీ కొండచేరి, నీ అనుగ్రహముకొఱకై తపమాచరించుచున్నాడు.

సనకసనందనాది మహర్షులు, అగస్త్య వశిష్ఠాది ఋషిశ్రేష్ఠులు, వాయుదేవుడు, అంజనివంటి మహితాత్ములు నిన్ను పొందుటకై నీ కొండను శరణుజొచ్చిరి.

శ్రీవేంకటేశా! గురుని ఆజ్ఞపై నీ కొండచేరి నిన్ను తలచి తపమాచరించిన ఫలముగా దశరథునికి పుత్రునిగా రామునివై అవతరించి మమ్ము తరింపచేసితివి.

స్వామీ! “ఎవ్వరు నీ పాదపద్మములపై మనస్సును ఉంచి, నీ నామ, రూపములను శ్లాఘించుచూ, నీ దివ్యలీలా విశేషములను వినుచూ, గానము చేయుచూ, ధ్యానము చేయుచూ దాసులుగా నిలిచెదరో వారికి నీ పరమపదప్రాప్తి తథ్యమ”ని బ్రహ్మచేసిన స్తోత్రము మాకు అవశ్యము ఆచరణీయము.

శ్రీనివాసా! మాకు సద్బుద్ధినీ, వివేకమునూ ప్రసాదించుము. దుస్సంగము నుండి మమ్ము రక్షించుము.

శ్రీ వేంకటేశా! నీ ఇచ్ఛకు విరుద్ధముగాని ఇచ్ఛను మాకు ప్రసాదించుము. నీకు యిష్టముకానిది మాకునూ అనిష్టమగునట్లు మమ్ము దీవించుము. నీవు తప్ప మమ్ము కాచువారు లేరు. నీ ఎడల దైన్యత, నీకొరకు సమర్పణ, నీ ఎడల నిరంతర ప్రార్థన, నీవారితో నిత్యము నెయ్యము–మాకు ఎడతెగని బంధమై నిలుచునట్లు మమ్మనుగ్రహించుము.

స్వామీ! మాకు యిష్టలాభమును, అనిష్టనాశనమును కల్గించేందుకై నీవు శంఖచక్రములను ధరించితివి. అందరికీ నీ పాదద్వయమే శరణమని ఒకచేత చూపుచూ, నిన్ను శరణుజొచ్చినవారికి ఈ సంసారసాగరము మోకాలిలోతేయని మరొకచేత తెలుపుతూ నిలుచున్న శ్రీవేంకటేశా! నీ నామస్మరణమే మాకు రక్ష.

రాజ్యభ్రష్టుడైన శంఖణ చక్రవర్తి ఆరునెలలు నిష్ఠతో నీ కొండపై తపమాచరించినందుకు ఫలముగా అతనికి నీ దివ్యదర్శనమును, రాజ్యప్రాప్తిని అనుగ్రహించితివి. ఆశ్రితవత్సలా! నీ దయను ఎన్ని విధముల కొనియాడగలము?

‘‘వేంకటాచలపతీ’’! అని నోరార నిన్ను పిలిచిన చాలును. మా పాతకములన్నియు పటాపంచలగును. నాలుగువేదములు చదివిన వారు కూడా నిన్ను భక్తితో కొలుచువారికి సాటిరారు కదా!

పరమపావనుడవైన నీ సాహచర్యముకోరి శంకరుడు నీ కొండదిగువన నిన్ను ధ్యానించుచూ నిలిచె. చతుర్ముఖబ్రహ్మ సమస్త దేవతలతో కలిసి నీ కొండపై నీకు ప్రీతికరముగ మహోత్సవము జరిపె. నాటి బ్రహ్మోత్సవము నేటికినీ మమ్ము బ్రోచెడి దివ్యోత్సవమే.

వరాలరాయుడవైన ఓ వేంకటేశా! కరుణచూపుటలో సాటిలేని మేటి స్వామివి నీవు. నీ కొండపై రంగదాసుడు చేసిన చిన్నిసేవకు మురిసి తొండమాన్ చక్రవర్తిగా మరుజన్మనిచ్చి తరియింపచేసితివి. నీ భక్తప్రియత్వమునకు లేరు వేరెవరు సాటిలేరు.

ఈ కలియుగమ్మున మమ్ము కాచుటకై పద్మావతీదేవిని కళ్యాణమాడి ఆకాశరాజుకు అల్లుడవైతివి. నీ కొండపై కొలువుతీరుటకుగాను తొండమానునికి చెప్పి మూడు ప్రాకారములతో, రెండు గోపురములతో, ఏడు ద్వారములతో ‘‘ఆనందనిలయము’’ను అమర్చుకొంటివి. తొండమానునికి రక్షగా శంఖ చక్రములనిచ్చిన నీ వాత్సల్యమున కివే మా శతకోటివందనములు.

భక్తసులభుడవైన నీ అనుగ్రహమునకు పరవశించి, అది అంతయు తన గొప్పగా తలచి, తనంత భక్తుడు నీకు లేడని అహంకరించె ఆ తొండమానుండు. బంగారు తులసి ఆకులతోడ అతడు చేసిన పూజను తిరస్కరించి, మట్టి తులసిని నీవు ప్రేమతో స్వీకరించితివి. కడుపేదవాడైన కుమ్మరి భీముండు కుండలు చేయుచు నిన్ను తలచి నీకర్పించిన మట్టి తులసియే బంగారుతులసికన్న నీకు బహుప్రీతియని తొండమానునకు నీవు తేల్చిచెప్పితివి.

బుద్ధివచ్చిన ప్రభువు చూచుచుండగనె కుమ్మరి భక్తుని యింటకూడుకుడిచి, పరమపదమునకతనిని భార్యాసమేతముగ పంపినావు. నాటి నుండి నీవు “తోమని పళ్ళాలవాడి”వై, నీ సౌలభ్యగుణమును ఎల్లలోకములకు చాటుచుంటివి.

రాజు, పేద అను తారతమ్యము చూడక, నిష్కల్మషముగ నిన్ను మ్రొక్కిన వారె నీకు ప్రియులని చాటి చెప్పిన శ్రీవేంకటేశా! నీకు శరణు! శరణు!!

బ్రహ్మాది దేవతలను మొదలుకొని కుమ్మరి భీముని వరకూ తరింపచేసిన శ్రీ వేంకటేశా! మమ్ము బ్రోచుటకై ఈ కొండపై నిలచిన నీ ప్రేమాతిశయమునకివే మా శతకోటి ప్రణామాలు.





### శ్రీ వేంకటేశ శరణాగతి - 3

## తిరుమల నంబి నిష్ఠ !...

శ్రీవేంకటాద్రియందు అర్చావతారమున దివ్యమంగళ విగ్రహముతో మమ్ము తరింపచేయుటకై అవతరించిన అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా! నీకు శరణు!

ఓ శ్రీనివాసా! నీ పాదములయందు మా భక్తి స్థిరముగా ఉండునట్లు అనుగ్రహించుము.

ఓ అలమేలు మంగపతీ! వేంకటరమణా! ఈ జగత్ కుటుంబమును పోషించుచున్న తండ్రివి నీవు, నీవె మాకు తల్లివి, గురుడవు, సఖుడవు, సోదరుడవు, పాలకుడవు, సమస్తమూ నీవె. మాకు ముందు, వెనుక, ప్రక్క, పైన క్రింద, లోపల, బయట, అన్నివైపులా నిలచి మమ్ము కాపాడుము.

ఓ శ్రీమన్నారాయణ! మేము నీ దాసులము. నీతో నిత్యసంబంధము కలవారమై నీపైననే ఆధారపడి జీవించునట్లు మమ్ము ఆశీర్వదింపుము. ఆశ్రిత వత్సలా! అభయప్రదాతా! నిన్ను చేరి కొలుచు తీరెట్టిదో తెలుపు భక్తవరేణ్యుల గాథలు సదా మా నాలుకలపై నడియాడు శక్తిని మాకు ప్రసాదించుము.

నీ శ్రీరంగక్షేత్రమున నీ భక్తులకెల్ల పెద్ద దిక్కుగ నిలచిన యామునాచార్యులు నీపై గల ప్రేమాతిశయముతో తన శిష్యుడైన తిరుమలనంబితో కలసి నీ కైంకర్యసేవలో పాల్గొని తరించిన విధము ఎల్లవారలకూ స్ఫూర్తిదాయకము.

గురునాజ్ఞపై ఏడుకొండలపై నిలచిన నీకు కైంకర్యము చేయు వ్రతదీక్ష చేపట్టి విద్వాంసుడైన ఆ తిరుమలనంబి. నీ కొండపైనున్న దుర్భరమైన చలి నంబిని ఇసుమంతైనను చలింపచేయలేకపోయె. భయంకరమైన కాలసర్పాలు, కీటకములు, క్రూరమృగములు ఆ భక్తుని భయపెట్టలేకపోయె.

నీ కీర్తనలె ఆహారముగ, నీ సేవయే ఊపిరిగ, నంబి నడిచిన నడత నీకు ప్రీతిని కలిగించె. పుష్పప్రియుడవైన నీకు పూలమాలలుకట్టి, నీ వైభవమును చాటు పాటలు పాడునతడు. అపరభగీరథుండై పాపనాశనమునుండి నీకు అభిషేకగంగను తెచ్చునతడు. నిష్ఠగా ఏండ్ల తరబడి నీకు వెట్టియై ఏమరిపాటులేక నిత్యము నిన్ను సేవించుచున్న తిరుమలనంబి భక్తి తత్పరతను మాకు చాటుటకు శ్రీ వేంకటేశా! నీవు బోయవైతివి కదా!

పాపనాశనమునుండి ఎప్పటివలె నీకు నీరు తెచ్చుచున్న నంబిని బోయరూపమున నీవు అడ్డగించితివి. నీరడిగిన నిన్ను నిరాకరించి, నీ గుణగానము చేయుచు ముందుకు నడిచె ఆ నంబి. అలనాడు వెన్నదొంగవై గొల్లభామలకుండలకు చేసిన సత్కారము కడ చతురతతో నీవు నంబి కుండకు చేసితివి.

“మందభాగ్యుడా! ఎంత పనిచేసితివి? భగవదపచారము నీకు తగునా” యని నంబి నిన్ను నిగ్గదీసె. కొంటె నవ్వు నవ్వి, శరాఘాతంబుతో ఆకాశగంగను సృష్టించి, ‘అదియెనీస్వామికి తగిన నీర’ని నంబితో పలికి మాయమైతివి. అంతటితో ఆగక నీవు అర్చకుని ఆవహించి, నంబి భక్తిని చాటి, ఆకాశగంగను నీకు ఉదకము”గ ప్రకటించుకొంటివి. ప్రతిఏటా నీవు జరిపించుకొను “ఆకాశగంగ తీర్థోత్సవము” తిరుమలనంబిపై నీకు గల ప్రేమ ఫలితమే కదా!

‘తాతా’యని నీ చేత పిలిపించుకొన్న తిరుమలనంబిదే అదృష్టము. రామానుజునకు శ్రీ మద్రామాయణ రహస్యములు బోధింప నంబి ఒక సంవత్సరకాలము ప్రతిదినము కొండ దిగువకుపోయివచ్చె. నీ సేవ అనంతరము నంబి కొండదిగి శిష్యునికి చెప్పిన అర్థము చెప్పకుండా 18 మార్లు రామాయణ రహస్యార్థములను రంగరించి చూపె.

మధ్యాహ్న సమయమున నీ సేవకు దూరమైతినన్న నంబి చింతను పారద్రోలుటకై వారి అధ్యయన స్థలమునందే నీ ‘దివ్యపాద’ చిహ్నములను, మాకు భక్తిప్రవృద్ధిదాయకములగునట్లుగా దర్శింపచేసితివి.

ఓ లక్ష్మీరమణా! జీవితాంతము నీ సేవతోనే తరించిన ఆ తిరుమలనంబిపై నీవు చూపిన అనుగ్రహదృష్టిని మాపైన కూడా ప్రసరింపచేయుము.

ఓ గోవిందా! అజ్ఞానముతో, అలసత్వముతో, మూర్ఖతతో, అవివేకముతో, కామక్రోధలోభ మోహ మద మాత్సర్యములతో విచ్చలవిడిగా చపలత్వముతో సంచరించు మా అంతఃకరణములను నీ స్వాధీనము చేసుకొనుము.

మా చెడ్డ తలంపులను నాశనముచేసి, నీ ధ్యానమునందు ఏమరుపాటులేని విధముగా మమ్ము దీవింపుము.

స్వామీ! నీవు జ్ఞానానంద స్వరూపుడవు. మా దోషములను మన్నించి నిన్ను చేరు దారి చూపి కాపాడుము. “గోవిందా! గోవిందా” యని నీ గుణగానము చేయు మనస్సును మాకు అందజేయుము.





**శ్రీ వేంకటేశ శరణాగతి -4**

# పూల రంగడు అనంతార్యునికి అల్లుడు!...

ఓ తిరుమలవాసా! శ్రీనివాసా! నీ జ్ఞానంతో నిండి, నీ ప్రేమతో పండిన వారిదే కదా బ్రతుకు! ఎంతటి దుష్టుడైననూ తెలిసియో, తెలియకయో పరిహాసమునకైననూ నీ నామమును పలికిన  చాలును. వారి సమస్త పాపములను భస్మీపటలము చేసి స్వర్గమోక్షములను అనుగ్రహించెడి కరుణామయుడవు నీవు.

వైకుంఠవాసా! అలనాడు నిన్ను శోధించు నిమిత్తమై భృగుడు నీకు చేసిన అపచారమునకు ఆగ్రహించక సాదరముగ తండ్రి బిడ్డను ఆదరించినట్లు ఋషిని లాలించితివి. నీ చేష్టకు అలిగి వైకుంఠమును వీడిన లక్ష్మిని వెదకు నెపమున ఏడుకొండలకు చేరితివి కదా స్వామీ! నీపై ఆ బ్రహ్మ, శివులకు ఎంత ప్రేమ! పుట్టలోన నిలచిన నీవు ఆకలిదప్పులతో ఉన్నావని భావించి వారిరువురూ నీకై ఆవు దూడలుగా మారి, రాజుకు అమ్ముడుబోయి, పాలధారలను మాత్రము నీకే అందించినారు కదా!

రాజుకు దక్కవలసిన పాలు పుట్టపాలవుతున్నాయని కినిసి గొడ్డలితో గోవును అదలించబూనిన గొల్లవాని దూకుడు పుట్టనుండి వెలికి వచ్చిన నిన్ను గాయపరచినది. ఎంత ఆశ్చర్యము! నిన్ను చూచి, నీకు జరిగిన అపచారమునకు హడలి ప్రాణములు విడచినాడు ఆ గొల్లవాడు. ఆ జీవునకు సద్గతిని ప్రసాదించుటతోబాటుగా అతని సంతతి వారికి ఈ కలియుగాంతము వరకూ నీ తొలిదర్శనమును వరముగా అనుగ్రహించితివే. “సన్నిధిగొల్ల”గా నిలచి, నీ సేవలలో తరించుచున్న ఆ గొల్లవాని సంతతిదే కదా భాగ్యాతి భాగ్యము.

నిన్ను గాయపరిచి నీ అభిమానమును పొందినవారి వరుసలో గొల్లవానికి తోడుగా నిలిచిన అనంతార్యుని సౌభాగ్యము మాత్రము సామాన్యమైనదా!

యామునాచార్యులవలె నీ సేవకై తన శిష్యులను ప్రోత్సహించుచున్న రామానుజులమదికి సంతసము కలుగునట్లుగా అనంతార్యుడు గురుని అభిమతమును నెరవేర్చు దీక్షను ప్రకటించె. నీ కొండపైనున్న ఈతి బాధలకు వెఱచి, నీ సేవచేయసాహసించని ఇతర శిష్యులకు సిగ్గుకలుగునట్లుగా రామానుజులనుండి ‘మగధీరుడ’న్న ప్రశంసలు పొంది భార్యాసమేతముగ నీ కొండచేరినాడా అనంతుడు.

లెక్కకు మీరిన సంకటములెదురైనా వెనుదీయక గురుభక్తితో నీ కైంకర్యనిష్ఠను ప్రకటించిన అనంతార్యునిపైన నీకును అపారమైన అభిమానమే.

పుష్పప్రియుడవైన నీకై పూలవనమును పెంచ అనంతార్యుడు సరస్సు త్రవ్వగ సిద్ధమాయె. ఇతరులెవ్వరిని శ్రమపెట్ట నిచ్చగించక భార్యతో కలసి అతడు నీకై చెఱువు త్రవ్వుచుండుట నీకు మురిపమాయె! నిండు గర్భిణితోడ మట్టి తట్టలను మోయించు అనంతార్యుని అధికశ్రద్ధకు నీవు ఆనందించి బాలుడవై సాయము వెళ్ళితివి.

తన కైంకర్య దీక్షకు అడ్డుపడుచు, వలదన్ననూ వినక, మట్టితట్టలు మోయు ఈ మొండి బాలుడు ఎవడని మండిపడె అనంతార్యుడు. ఆగ్రహముతో అనంతార్యుడు తన చేతి గునపమును నీపైన విసరగా, నీ చుబుకమునకు చిన్నగాయమయ్యె. రక్తధారలతోడ నీవు అనంతార్యుని విడిచి నీ ఆలయములోనికి పరుగులిడితివి.

ఆందోళనతో నిన్ను అనుసరించిన అతనికి నీ బాలరూపము కనిపించదాయె! గుడిలోని నీ దివ్యమంగళవిగ్రహమ్మున రక్తధారలు గోచరించ అనంతార్యుడు ఆశ్చర్యచకితుడై గగ్గోలుపెట్టె. నిన్నాతడు అపరాధక్షమాపణ వేడుచూ గాయమైన నీ గడ్డమునకు పచ్చకర్పూరమద్దె.

దోషభోగ్యుడవైన ఓ భోగమూర్తీ! అనంతార్యుని కైంకర్య శ్రద్ధాతిశయముపై నీకు గల ప్రేమకు గుర్తుగా నీ వదనమండలమున ఏర్పడిన గాయమ్ముపై నిత్యము గుబాళించు పచ్చకర్పూరమద్దమని నీ అర్చక పరివారమును శాసించితివి.

ఏ గునపముచే నీకు గాయమయ్యెనో ఆ గునపము నీ భక్తులందరికి దర్శనీయమగునట్లు నీ ఆలయముననే దానిని భద్రపరచితివి. కడు విచిత్రము కదా నీ లీలావిశేషము.

నీ కొండపై రామానుజుని పేర పూలవనమును అనంతుడు కడు భక్తితో పెంచసాగె. నీకు తప్ప అన్యులకు భోగ్యమ్ము కారాదని అతడు శ్రద్ధతో ఆ తోటను కాచుచుండె. అనంతార్యుడి పట్టుదలనొకసారి రుచిచూచియూ, తృప్తిచెందక నీవు, మా అమ్మ పద్మావతితో కలసి మనుజరూపమున తోటలో విహరించసాగితివి. ఇచ్చవచ్చినట్లు రాత్రులందు తన తోటలో విహరించు మీ జంట భరతంబు పట్ట మిమ్ము పట్టబోయినాడా అనంతుడు. మునుపు పొందిన సత్కారమును గుర్తుంచుకొని నీవు మాయమైతివి కాని అమ్మ చిక్కిపోయె. పద్మావతిని పట్టి చెట్టుకు కట్టి నీ పతి చిరునామా చెప్పమని అనంతుడు నిర్బంధించసాగె. మరురోజు తాను బంధించినది అలమేలుమంగనని అర్చకులనంపి అనంతునకు తెలిపిన మాయావివి నీవు.





తప్పు తెలుసుకొని, చెంపలేసుకొని అమ్మవారిని పూలబుట్టలో కూర్చుండబెట్టి నీకు సమర్పించినాడా అనంతుడు. ఆవిధముగా అనంతార్యునికి కన్యాదాన ఫలమునిచ్చి అతనికి నీవు అల్లుడవైతివి. నీవాడిన ఈ వింత ఆటను మాకు గుర్తుచేయ ప్రతిఏట "పురిశైతోట ఉత్సవము"ను మా మేను పులకించునట్లుగా నీవు జరిపించుకొనుచున్నావు.

యామునాచార్యుని పేరు మీదుగా అనంతార్యుడు ఆరంభించిన పుష్పకైంకర్యమును నేటికీ నిర్విఘ్నముగా నడిపించుకొనుచున్న నీ ఆశ్రిత వాత్సల్యమునకివే మా శతకోటి వందనములు. ఆ అనంతుని వలె నీ దయకు పాత్రులమగునట్లు, మంచి దాసులుగ ఉండునట్లుగ మమ్ము ఆశీర్వదించు.

**శ్రీ వేంకటేశ శరణాగతి - 5**

## క్షేత్ర ద్రష్ట! భాష్యకర్త!.... రామానుజ!

ఆనంద నిలయమున చిద్విలాసముగ నిలచి లోకములను పాలించుచున్న శ్రీ వేంకటేశా! నీకు శరణు. మా అంతరంగములలో నీ పట్ల అప్రమత్తతను, నీ పట్ల నిరంతర వినమ్రతను మాకు అనుగ్రహించుము. మా మాటలలో, మా చేతలలో, మా భావనలలో, మా నడవడిలో నీ సంకల్పమే నిలచునట్లు మమ్ము దీవించుము.

ఓ దేవదేవా! మా అపరిపక్వతను రూపుమాపి పరిపూర్ణతను అనుగ్రహించుటకై మమ్ము నీ సేవకులుగా మార్చుకొనుము.

రేయనక పగలనక వేధించు వాంఛలతో నుగ్గు నుగ్గగుచున్న దీన జీవులము మేము. వంచనా వలయములకు చిక్కి వ్యధలతో పొర్లాడు మూస బతుకులు మావి. నీ పర, వ్యూహ, విభవ తత్త్వముల ఎఱుకయే మాకులేదు. అంతర్యామివని అందరూ అందురేగాని అటకూడ నీవు మాకు అతిదూరుడవె. అర్చామూర్తివయిన నిన్ను కొలుచుక్రమమెట్టిదో తెలియజాలని అల్పబుద్ధులుమావి.

మా హీనతని గ్రహించి, నిన్ను పట్టెడి నేర్పు మాకు అలవరచుటకుగాను, భక్తితత్త్వపు బాటను మాకు తెలిపెడి గురునిగా భువిపైన 'రామానుజు'ని అవతరింపచేసితివి నీవు.

నూట ఇరువది ఏండ్లు ఈ నేలపై చరియించి, విష్ణుతత్త్వపు ఘనతను వాడవాడల చాటిన పరమదివ్యగురుడు మా రామానుజుండు.

ఈ కలియుగంబున నీవె గతియని చాటిన ఘన గురుదైవమతడు. గతులు తప్పిన మా మతులకు నీ గురుతు తెలిపి, నిన్ను చేరెడిదారి చూపిన మార్గదర్శి. నిన్ను ప్రకటించు విషయమున ఆయన గురువులకే గురువు.

గుడిగోపురమునెక్కి ఎల్లవారలను తరియింప చేసెడి నీ దివ్యమంత్రమును వెదజల్లినట్టి సౌశీల్యమూర్తి. అస్పృశ్యులని జనులు ఈసడించిన వారిని ఓదార్చి, నీ వొడికి చేర్చి, జీవులందరు నీ సంతానమేయని ప్రేమతోడ చాటి చెప్పిన నీ వాత్సల్యపు మూటయతడు.

భార్య అందము తప్ప మరి ఏమి పట్టని ధనుర్దాసుకు నిన్ను చూపి, నీకు బానిసగ అతనిని మార్చిన నీ సౌందర్యపు నిలువుటద్దమె ఈ రామానుజుండు.

శ్రీ భాష్యకారుడై, విశిష్టాద్వైత తత్త్వమును ఇలను స్థిరముగ నిలపిన ధీశాలి ఇతడు.

నీ దివ్యదేశముల అస్తవ్యస్తతలను చక్కపరచి, ఆగమోక్తముగా ఆరాధనలు సలుపు క్రమమును విశదపరచిన ఆచార్యశేఖరుడు.

నారాయణుండవే నీవని, నీదు క్షేత్రపు మహిమను నిర్ద్వంద్వముగ చాటి, వాదులాటకు దిగిన వ్యర్థుల గర్వము ఖర్వము చేసిన ఘన తపశ్శాలి.

మోకాలితో నీ కొండనెగబ్రాకినట్టి భక్తిత్పరుండు. నీకు శంఖ, చక్ర ప్రదాత. వీర నరసింహ గజపతి నీకు అర్పించిన నాగాభరణమునకు జతగ వేరొకటి నీకు అర్పించినట్టి అలంకార మూర్తి.

నీదు వక్షస్థలమున మా అమ్మను అమర్చి, నిన్ను 'అలమేలు మంగతాళి మెడవాని'గా మార్చి, శుక్రవారపు అభిషేక భాగ్యమును మాకబ్బజేసిన సౌభాగ్యశాలి.

నీ కొండపైని పూలు నీ భోగమునకే తప్ప, నరులకనర్హంబను నియమమేర్పరచిన కైంకర్యశాలి. సద్భక్తుడైన నీలకంఠునిచే అర్చించబడిన నీ నారసింహమూర్తికి ఆరాధనాలోపము జరుగరాదని తలచి, నీ దివ్య ఆలయముననే, నీ దివ్య విమానమునకు అభిముఖదృష్టి కలవానిగా ఆ మూర్తిని ప్రతిష్ఠించిన శాస్త్రవేత్త.

నీకు సంతసమగునట్లు తీరైన "ఊర్ధ్వపుండ్రములను నీకు ధరింపచేసి, నీ శోభను ప్రకాశింపచేసిన ఉజ్జీవకరుడు.





నీ దేవాలయమునకు తిన్నని మాడవీధుల నిర్మించి, వైభవముగ నీదు ఉత్సవములను నీ కొండపైననె నడిపించినట్టి నియమశీలి.

బింబాధరుండను వైఖానస తంత్ర పారంగతుడైన భాగవతోత్తముని పంచ సంస్కారపరుడైన అర్చకునిగా నిలిపి, నీకు నిత్యారాధనను సక్రమముగ నిర్వర్తింపచేసిన యోగీశ్వరుండు.

నీ కొండపైన మృతకళేబరములకు దహన సంస్కారాదులు జరగరాదను నియమంబుచేసిన పవిత్రమూర్తి.

నీ కొండమీద విహరించు మృగపక్ష్యాదులను సహితము నీ రూపముగ తలచి వాటిని హింసించరాదను కట్టుబాటును చేసిన ప్రేమశీలి.

దిగ్బలిని ఇచ్చు నీ దివ్యనగరవీధులయందు (మాడవీధులు) పాదరక్షలు ధరింపరాదని, వాహనములు ఎక్కరాదని నియమంబు చేసిన యతిరాజు ఇతడు.

నీ పరత్వ దివ్యత్వమును సదా మాకు స్ఫురణకు తెచ్చుటకు నీ అనుమతితో రామానుజుండేర్పరచిన ఇట్టి నియమంబులు మా బోటి భక్తులకు దాట వీలుకానిది కదా!

క్రిమికంఠచోళుని వలన భగ్నమైన నీ చిత్రకూట ఆలయమును శ్రీ పద్మపురి యందు కడు రమ్యముగ నిర్మింపజేసిన ధర్మరక్షకుండు రామానుజుండు.

తన శిష్యుడైన యాదవరాజుచే "దివ్య ఆలయ సముదాయభరిత తిరుపతి క్షేత్రముగ "శ్రీ పద్మపురి"ని తీర్చిదిద్దించినట్టి రాజగురుడు.

సప్తగిరీశుడైన శ్రీనివాసునిగ, క్షీరాబ్ది శయనగోవిందునిగ తిరుమల, తిరుపతిక్షేత్రములయందు నీ వైభవ ప్రకటనమునకై యతిరాజును నీవు అంగీకరించిన విధము నీ సేవక వ్రతదీక్షకొక చక్కని నిదర్శనంబు.

నియమబాహుళ్యముతోడ నీ ఆలయ పాలనమును సుబద్ధీకరించి, నీ శరణాగతికి మార్గమును మాకు తెలిపిన రామానుజాచార్యుని గురుత్వమును లోకమున చాటుటకు నీ దివ్యసన్నిధానమున విగ్రహరూపమున ఆచార్యుని శ్రీమూర్తిని ప్రతిష్ఠింపచేసిన ఓ శ్రీనివాసా! నీకు శరణు! శరణు!!

### శ్రీ వేంకటేశ శరణాగతి - 6

# రామానుజార్య దివ్యాజ్ఞా వర్ధతాం! అభివర్ధతాం!!

“నిన్ను ఆశ్రయించిన భక్తులను విడచి ఒక్కక్షణమైన ఉండలేన’ని ప్రతిజ్ఞచేసి, మాపైన అపారమైన ప్రేమతో భూలోకవైకుంఠమైన తిరుమల క్షేత్రమున దివ్యమంగళవిగ్రహరూపముతో స్థిరముగా నిలచిన శ్రీవేంకటేశా! నీకు శరణు! స్వామి! నీవు అపారప్రేమా సముద్రానివి. నిన్ను తలచిన చాలును, దర్శించిన చాలును, స్తుతించిన చాలును. పరమసంతోషముతో మా పాపరాశులనెల్ల మటుమాయముచేసి మా కోర్కెలను నెరవేర్చి మమ్ము బ్రోచుటకు సిద్ధపడెదవు.

కానీ స్వామి! మేము క్షుద్రులము. టక్కరులము. మాంసఖండము కొరకు కాకిని నక్క స్తోత్రము చేసినట్లుగా మా వాంఛా పరితృప్తికై నిన్ను స్తోత్రము చేయు స్వార్థపరులము.

కామక్రోధములతో కలుషితములైన మా మనస్సులు నిన్ను కొలుచుటలోన ఎపుడూ మోసంతో నిండినవే ! వాటికి విషయ చింతనలపైనున్న శ్రద్ధ నిజముగ నీ పాదములపై లేదు. నీ కరుణ కయోగ్యులమైన కపటులము మేము.

నీవు సుగుణాలప్రోవువు. మేము దోషరాశులము. నీతో సహా ప్రపంచములోని ప్రతివస్తువూ మా భోగానుభవము కొరకే ఉన్నదని భ్రమించి జీవించు అజ్ఞానులము. తాత్కాలిక సుఖములవెంట పరుగులిడి, యాతనా సముద్రములోన మునకలిడుచు ‘శ్రేయస్సు’నకు దారి తెలియక దుఃఖించు దీనులము మేము.

రాగద్వేషముల రొచ్చునుండి మమ్ము తరింపచేసెడి వాడవు నీవని తెలిసినప్పటికీ, నీ చేయి పట్టుట ఎట్టులో తెలియక చావు పుట్టుకల ఊబిలో కూరుకున్నవారము.

ఓ వేంకటేశా! ఇవి యన్నియు నీకు తెలియనివి కావు. కాని ఏమియు తెలియని వానివలె, మమ్ము తరింపచేయుటకు నీ వెన్నో జన్మలెత్తితివి కదా!

మా పాపకర్మలనుండి మమ్ము పరిశుద్ధులను చేయుటకు నీవు ఎన్నియో ఉపాయములు పన్నితివి. అన్నియును విషయలాలసులమైన మా ముందు వ్యర్థములే. అయిననూ విసుగులేని కృషీవలుడవు నీవు.

నిన్ను ప్రేమించుటెట్టులో నేర్పుటకు నీ దివ్యసూరులను మానవులుగా మార్చి మాకు ఉదాహరణముగా నిలుపుచుంటివి.

ఆ భక్తుల అడుగుజాడలలో నడచి నిన్ను చేరెదమను పేరాశ నీది. నాలుగడుగులు వేసి చతికిలబడు చవట బ్రతుకులుమావి. నడచుట కిష్టపడనిమాకు నడతనేర్పుటకు శ్రీవేంకటేశా! నీవెంత కష్టపడుచుంటివయ్యా!





అర్చామూర్తివై విగ్రహరూపమున ఉలుకుపలుకులేక నీవు నిలుచున్నది మా దోషదర్శనమునకు కాదు. మమ్మనుగ్రహించుటకు. అట్టి నిన్ను చూపి, ఆరాధించుటెట్టులో మాకు నేర్పిన గురుడు రామానుజుండు. ఆ మహితాత్ముడు ప్రేమతో నీ కొరకు చేసిన ఘనకైంకర్యములు మా బోటి భక్తులకు బహుస్తుతి దాయకములు.

నీ కొండ క్రింద నీ భక్తుడు తిరుమలనంబి చెంత రామాయణ రహస్యములను గ్రహించు రామానుజుని వద్దకు లక్ష్మణహనుమత్సుగ్రీవాంగద సహితముగ శ్రీరామచంద్రమూర్తివై విగ్రహరూపమున నీవు చేరినావు.

నీవట్లు చేరగా ఆ మహానుభావుడు నీ శ్రీమూర్తికి సీతను జతచేసి, నీ కొండపైనున్న నీ దివ్యాలయము నకు ఆ మూర్తులను చేర్చి నిత్య ఆరాధనమును, కళ్యాణమును నియమంబుగా ఏర్పరచి మమ్ము తరింపచేసె.

నీ దివ్యాలయమున ధనుర్మాసమునందు తిరుప్పావై గానమును వినిపించుటతో పాటు నీ శ్రీకృష్ణమూర్తి స్వరూపమునకు దివ్యపర్యంకశయన భోగవిలాసమును ఆ రామానుజుండు వ్యవస్థగా ఏర్పరచె.

శ్రీనివాసా! నీ రామకృష్ణావతార తత్త్వరహస్యంబులపై మాకు ప్రీతి పెంచ రామానుజులను ఈ విధముగా సాధనముగా చేసుకుంటివి కదా!

శ్రీ వేంకటేశా! నీకంటె ముందుగా నీ కొండపై చేరి జ్ఞాన ప్రదాత అయిన నీ వరాహమూర్తి స్వరూపమును ముందుగా మేము సేవించవలెనని నీవేర్పరచిన నియమమును రామానుజుడు ఆచారముగ గట్టిపరచె. నీ వరాహమూర్తికి ఉత్సవవిగ్రహమును అవతరింపచేసి, వరాహజయంతియందు విశేషోత్సవము జరుపవలెనని యతిరాజు శాసనముచేసె. ఇదియంతయూ సుజ్ఞానమును మాకు అందించు నీ ప్రేమప్రకటనమే కదా!

శ్రీవేంకటాచలపతీ! నీ తోమాలసేవసమయమున నీకిష్టమైన ఆళ్వార్ల దివ్యప్రబంధగానమును నీ అనుమతితో నియమంబుగా ఏర్పరచె రామానుజుండు.

శ్రీవైష్ణవపండితగోష్ఠి, శాత్తుమురై వంటి బహుదివ్య విశేషంబులను, నీకు ప్రీతిగ నీ ఉత్సవములందు రామానుజుండు నియమనంబుచేసె.

ఇన్ని నియమంబులున్నను, ఇవి అసలగు వ్యవస్థలేకుండిన సర్వము నిష్ఫలంబగునను సత్యమెరిగిన రామానుజుండు నీ క్షేత్ర పాలనకు తగు వ్యవస్థను చేసె.

నీ ద్రవ్యమును హరించు పేరాశతో పాపకర్ములు నీ దివ్యదేశమున అపరాధములు జరుపకుండునట్లుగ, నీ దివ్యవైభవప్రకటనకు, ఆచారవిశేష వ్యవస్థల పరిరక్షణకు తగిన వ్యక్తులను రామానుజుండు ధర్మరక్షకులుగా నియమించె.

భక్తివైరాగ్య ప్రధానుండై, నీ దివ్యదేశవాసియై, నీ సర్వపరికరనియంతగా శఠకోపయతీంద్రుని 'జీయరు"గా రామానుజుండేర్పరచి, అతనికి సహాయకులుగా నలుగురు ఏకాంగులను నియమించె.

దోషరహితంబైన నీ కైంకర్యరక్షణకుసాధనభూతుండు 'హనుమంతుడు' కనుక, హనుమచిహ్నములతో కూడిన నీ దేవాలయపు (తాళం చెవిని) కుంచికను, ఉంగరమును, గంటను, ధ్వజమును శఠకోపయతి జీయరుకు రామానుజుండందజేసె.

నీ దివ్యాలయమున కెదుట నిలచిన 'హనుమమందిర' సమీపముననే 'జీయరు'కు రామానుజుండు నివాసమేర్పరచె. ఆ మఠమునందున తానారాధించిన నీ శ్రీరామచంద్రమూర్తులను ప్రతిష్టించి, శఠకోపయతికి స్వాధీనపరిచె.

కలి దోషవశమున ఆస్తికులకు కూడ ద్రోహచింతన కలుగును. కనుక నీ సంపదలకు, మర్యాదలకు హానిజరుగరాదను తలపుతో అనంతార్యునివంటి ఉత్తములతోడి **"ధర్మాచార్యపురుష"** వ్యవస్థను రామానుజుండేర్పరచె.

నీ నిమిత్తమై తానేర్పరచిన ధర్మమర్యాదలు మీరకుండ, ఆలయపాలనమును పర్యవేక్షించమని ఆదేశపాలకుడైన యాదవరాజునకు హితమునుపదేశించె యతిరాజమౌని.

"సర్వలోక హితకరమైన శ్రీమద్రామానుజాచార్యుని దివ్యాజ్ఞసమస్త దేశములందును, దిక్కులందును, కాలములందును అప్రతిహతముగా వర్ధిల్లుగాక" యని శ్రీరామానుజుని నియమములను ప్రీతితో ఆమోదించిన శ్రీవేంకటేశా! నీకు శరణు! శరణు!

### శ్రీ వేంకటేశ శరణాగతి - 7

## కోనేటిరాయా! కోరిన వరములనిమ్ము!...

శ్రీ వేంకటేశా! నీ లీలా విశేషభరితకథావృత్తాంతం మృత్యు సదృశమైన మా సంసారబాధలకు దివ్యామృతం. నీ గాథలను విన్నవారు, స్మరించినవారు, చదివినవారు అధికపుణ్యరాశులతో తరిస్తారు. ఇక నిన్ను గురించి మాట్లాడుకోవడమంటే నరకాన్ని దూరం చేసుకోవడమే కదా!

నీవు నమ్మినవారి భయాలను పారద్రోలి నిశ్చింతను ప్రసాదించె శ్రీమన్నారాయణుడవు. ఓ శ్రీనివాసా! ఆశ్రితపారిజాతా! నీ దివ్యపాదమహిమను ఏమని కొనియాడగలము? నీ పాదమును కడిగి బ్రహ్మధన్యుడయ్యాడు. నీ పాదమును తాకి గంగ పరమపునీత అయింది. నీ పాదోదకాన్ని శిరస్సున దాల్చి పరమశివుడు





లోకారాధ్యుడయ్యాడు. పావనమైన నీ పాదాన్ని తన తలపై మోసి బలి చరితార్థుడయ్యాడు. నీ పాదస్పర్శవల్లనే కదా అహల్య పునర్జన్మను పొందింది.

నీ పాదాన్ని ఆశ్రయించిన ఉద్ధవునివంటి భక్తులెందరో ముక్తి లాభాన్ని పొందగలిగారు. నిజానికి ఈ విశ్వరాశియంతయు నీ పాదధూళియే కదా!

అయినను ఒక్కమాట! మేము సామాన్యులముకాము. పైవారితో మాకు సామ్యమ్ములేదు. సౌమనస్యమునకు దూరమై, దురహంకారముతో నిలువెల్ల విషమునిండిన కాళియుని సంతతి వారము మేము. నీ దివ్యపాద మర్దనమే మా విఱ్ఱవీగుడుకు విరుగుడు. స్వామీ! అందుకే కోరుచున్నాము నీ పాదస్పర్శను. అనుగ్రహించి మా తలలపైన నీ పాదముద్రను రక్షగా నిలుపుము.

నీ భక్తప్రియత్వము లోకవిదితము. అది ప్రకటించుటకు నీవు ఎన్ని లీలలను నెఱపుచుంటివి?

"ఓయీ! నీవు వేంకటేశునికి ప్రియభక్తునివా? ఆ స్వామినీతో మాటాడి పాచికలాడునా? నీవంతటి గొప్పవాడవయిన బండెడు చెఱకును ఈ రాత్రికి తిని నీ భక్తిని నిరూపించుము" చూతమని గేలిచేసి, నీ భక్తుడు బావాజీని నిర్బంధించిన వారికి బుద్ధి చెప్పుటకు శ్రీవేంకటేశా! నీవు గజేంద్రుడవైతివి.

"విధవరాలవు. ఏ దిక్కూలేని అనాథవు. నీకీ కోవెలతో పనిలేదు. నిత్యకళ్యాణమూర్తి అయిన శ్రీనివాసునకు నీ వంటి అయోగ్యురాలు హారతిపట్టుట తగదు" అని నీ మహాభక్తురాలు వేంగమాంబను నీ మందిరమునుండి తరిమిన వారికి నీవు నేర్పిన గుణపాఠము బహువిచిత్రము. మాడవీథులయందు ఊరేగించుచున్న నీ దివ్యరథమును వేంగమాంబ ఇంటి ముంగిట కదలనీయక నిలిపి, నీ భక్తురాలని ఈసడించినవారి తప్పు తెలియునట్లుగా, ఆమెపై నీ అనుగ్రహమును బహిరంగ పరచితివి.

అమ్మ అలమేలుమంగతో అన్నమయ్యకు నీ కమ్మని ప్రసాదములను తినిపించి, అతనిని నీ వైభవప్రకటనము చేయు ఆస్థానగాయకునిగా కట్టిపడవేసితివి.

ఇటుల ఎన్నియో విధముల నీ భక్తులతో శ్రీనివాసా! సయ్యాటలాడితివి. మరి మాకెన్నడో కదా ఆ అదృష్టము? మా సుకృతములు పండునంతలో నిన్ను మరువక, నీకు సేవలందించు భాగ్యమ్ము మా కిమ్ము.

ఓ వేంకటేశా! కోరిన వరములనెల్ల కూరిమిగ సమకూర్చు భక్తవరదుడవు నీవు. కాని లాభమేమి? ఏది అడుగుటయో తెలియక, ఏదేదియో అడిగి అవి పొందియు దుఃఖ, నాశనములనే చివరకు మిగుల్చుకొను దౌర్భాగ్యులము మేము.

ఓ శ్రీనివాసా! కోరుట తెలియునని తమ తెలివికి గర్వించి, కోరిన వరములు పొంది కొఱగాని బ్రతుకులతో వ్యర్థులైన వారి వరసలో మమ్ముంచబోకు! వారి గడబిడలు మాకేల! బాలలము మేము. మమ్మేలు నాథుడవు నీవు. పోషకుడవు, రక్షకుడవు, నీవె. మాకేది ఉచితమో, దేనికి మేము తగుదమో దానిని ఇచ్చి మమ్ము బ్రోచువాడవు నీవు. ఇన్ని తెలిసియూ నిన్ను కోరుచున్నాము కొన్ని కోరికలు. కాదనక, లేదనక కనికరించుము మమ్ము.

ఓ వేంకటరమణా! నీ కింకరులమై వాడవాడలా నీ దివ్యలీలలను చాటు శక్తి మాకిమ్ము. భోక్తవు, కర్తవు, కర్మవు నీవెయన్న స్ఫురణనిచ్చి, మేము నీ చేతి పరికరముగ మారెడు భక్తినిమ్ము! నీ క్షేత్ర మర్యాదలనతిక్రమించి ప్రవర్తించు మంద భాగ్యుల నరికట్టి మంచి మార్గమున నడుపు తేజస్సు మాకిమ్ము!

లక్ష్మన్న, హనుమన్న, గరుడన్న, ఆదిశేషన్న, అంబరీషుడు, ప్రహ్లాదుడు– వీరు వారని పేరులేల నీ సేవకై నిరీక్షించెడి నిత్యసూరులబాటలో మమ్ము నడిపి, వారికిచ్చిన భత్యమేదో, అదియే మాకిచ్చినచాలును.

ఆరని విషయభోగముల చిచ్చులో ఎన్నియో జన్మలను దగ్ధము చేయుచుండియు తనివితీరక అవే ఆశల తీర్చమని మరలమరల నిన్ను కోరెడి మందభాగ్యుల సరస చేరకుండెడి విరక్తి వరముగా మాకిమ్ము. చాలును.

నిన్ను మరచిన క్షణమునందె మా చేతన మచేతనముగామారు వరమునిమ్ము. మాకదే చాలును. నీ ఉనికిని తెలుపునట్టి, నీ ప్రేమను పంచునట్టి గట్టి ఉదాహరణమ్ముగా మేము బ్రతికెడు వరమునిమ్ము. మాకదే చాలును.

అంతటా వ్యాపించిన నీ దివ్యతత్త్వమును అనుభవించెడి మంచి మనస్సును మాకందజేయుము. నిఖిలజగమునకు నీ దాసులుగ సేవలందించు సౌభాగ్యమిమ్ము. మాకదియే చాలు!

**ఓమ్ నమో వేంకటేశాయ!**

శ్రీమతే రామానుజాయ నమః

# శ్రీ వేంకటేశ పూజా విధానము

స్నానానంతరం పరిశుద్ధ వస్త్రములు ధరించి బొట్టుపెట్టుకొని గురు పరంపరను అనుసంధించుకొని, భగవంతుని సన్నిధి చేరి సాష్టాంగం నమస్కరించాలి. ఫోటో/విగ్రహాలు/ మామిడాకులు, కొబ్బరికాయతో అలంకరించిన కలశాన్ని పూజాస్థలములో ఉంచుకోవాలి. ఈ క్రింది శ్లోకములను విఘ్ననివారణకై పఠించాలి.

**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ।**
**ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాన్తయే ॥**

**యస్యద్విరదవక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతం ।**
**విఘ్నం నిఘ్నన్తి సతతం విష్వక్సేనం తమాశ్రయే ॥**

**వందే వైకుంఠ సేనాన్యం దేవం సూత్రవతీ సఖం ।**
**యద్వేత్ర శిఖరస్పందే విశ్వమేతత్వ్యవస్థితం ॥**

**క్షమాప్రార్థన**

అమర్యాదః క్షుద్రశ్చలమతి రసూయా ప్రసవభూః,
కృతఘ్నో దుర్మానీ స్మరపరవశో పంచనపరః ।
నృశంసః పాపిష్ఠః కథమహమితో దుఃఖజలధేః,
అపారాత్ ఉత్తీర్ణః తవ పరిచరేయం చరణయోః ॥

నమో నమో వాఙ్మనసాతిభూమయే నమో నమో వాఙ్మనసైకభూమయే ।
నమో నమోఽనంతమహావిభూతయే నమో నమోఽనంత దయైక సింధవే ॥

న ధర్మ నిష్ఠోస్మి న చాత్మవేదీ న భక్తిమాన్ త్వచ్చరణారవిందే ।
అకించనోఽనన్యగతి శ్శరణ్య! త్వత్పాదమూలం శరణం ప్రపద్యే ॥

కౌసల్యా సుప్రజా రామ! పూర్వాసంధ్యా ప్రవర్తతే!
ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవమాహ్నికం!

ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద! ఉత్తిష్ఠ గరుడధ్వజ!
ఉత్తిష్ఠ కమలా కాన్త! త్రైలోక్యం మంగళం కురు ॥

తతోఽఖిల జగత్పద్మ బోధాయాచ్యుత భానునా ।
దేవకీ పూర్వ సంధ్యాయాం ఆవిర్భూతం మహాత్మనా ॥

మనసులో చేయదలచిన ఆరాధనను ఒకసారి పూర్ణముగా భావించి, పంచపాత్రలలో పరిమళ తీర్థమును నింపి, అందులో తులసీదళంవేసి అష్టాక్షరీ మంత్రముతో అభిమంత్రించవలెను.

ముందుగ మనసులో ఆచార్యులను ఆరాధించినట్లు భావించండి.

"స్వాచార్య శ్రీహస్తేన ఆరాధనాభిముఖో భవేయం"
అని భగవంతునితో విన్నవించి)
స్వశేష భూతేన మయా స్వీయైః సర్వ పరిచ్ఛదైః ।
విధాతుం ప్రీత మాత్మానం దేవః ప్రక్రమతే స్వయమ్॥
భగవన్! పుండరీకాక్ష! హృద్యాగం తు మయా కృతమ్ ।
ఆత్మసాత్కురు దేవేశ ! । బాహ్యే త్వాం సమ్యగర్చయే ॥





(అని ప్రార్థించి పాదముల చెంత తులసిని అర్పించాలి) శ్రీ వేంకటేశుని మనసులో నింపుకొంటూ
సమస్త పరివారాయ సర్వదివ్య మంగళ విగ్రహాయ శ్రీమతే నారాయణాయ నమః,
శ్రీ, భూ, నీళా, గోదాది దేవిభ్యో నమః, అనంతగరుడవిష్వక్సేనాది నిత్యసూరిగణేభ్యో నమః,
శ్రీ పరాంకుశ పరకాల యతివర యామున వరవర మున్యాది ఆళ్వారాచార్యేభ్యో నమః,
(నమస్కరించవలెను).
ఓం సర్వాన్ ధ్యాయామి ((((మనసులో అందరినీ తలచుకోవాలి))
శ్రీనివాస పరబ్రహ్మణే నమః ఆవాహయామి (స్వాగత ముద్ర చూపాలి)
శ్రీనివాస పరబ్రహ్మణే నమః
రత్న సింహాసనం సమర్పయామి, (ఓ పుష్పాన్ని వేయాలి).
శ్రీనివాస పరబ్రహ్మణే నమః
హస్తయో రర్ఘ్యం సమర్పయామి, (చేతికి ఒకసారి నీటిని అందించండి)
శ్రీనివాస పరబ్రహ్మణే నమః
పాద్యం సమర్పయామి (పాదములకు రెండుసార్లు నీటిని అందించండి).
శ్రీనివాస పరబ్రహ్మణే నమః
ఆచమనీయం సమర్పయామి, (నోటికి మూడుసార్లు నీటిని అందించండి).
దంత కాష్ఠ, జిహ్వానిర్లేఖన, గండూషణ, ముఖప్రక్షాళన, తాంబూల, తైలాభ్యంజన, అంగోద్వర్తన, ఆమలకతోయ, హరిద్రా లేపన, స్నాన కూర్చ ప్రసారణాని సమర్పయామి,
అర్ఘ్యం సమర్పయామి, పాద్యం సమర్పయామి, (ముఖం కడిగి నలుగు పెట్టి శుద్ధి చేసి పన్నీటి స్నానం చేయించండి)
శ్రీనివాస పరబ్రహ్మణే నమః
స్నానం సమర్పయామి, (పుష్పాలతో నీటిని చల్లవలెను)
స్నానానంతరం శుద్ధ ఆచమనీయం సమర్పయామి,
శ్రీనివాస పరబ్రహ్మణే నమః
ప్లోత వస్త్రం సమర్పయామి, (దేహమును తడి ఆరునట్లు అద్దవలెను)
శ్రీనివాస పరబ్రహ్మణే నమః
వస్త్రయుగ్మం సమర్పయామి, (పుష్పమును సమర్పించాలి)
శ్రీనివాస పరబ్రహ్మణే నమః
ఊర్ధ్వపుండ్రాన్ సమర్పయామి, (కుంకుమ సమర్పించాలి).
యజ్ఞోపవీతం సమర్పయామి, (ఒక పుష్పం సమర్పించాలి).
శ్రీ శ్రీనివాస పరబ్రహ్మణే నమః
దివ్య శ్రీచందనం సమర్పయామి, (చందనము కాని, పసుపుకాని సమర్పించాలి).
శ్రీ శ్రీనివాస పరబ్రహ్మణే నమః
సర్వాభరణాలంకారాన్ సమర్పయామి,
(ఈ విధముగనే పరివారమున కందరకునూ అలంకరణ పర్యంతము ఉపచారములను చేసి)

**"ధ్యానమ్:-**

శ్రీ శ్రీనివాసః కులదైవతం నః  శ్రీ శ్రీనివాసః పరదైవతం నః
శ్రీ శ్రీనివాసః పరమం ధనం నః  శ్రీ శ్రీనివాసః పరమాగతి ర్నః
**శాంతాకారం భుజగశయనం, పద్మనాభం సురేశం ।**
**విశ్వాకారం గగన సదృశం, మేఘవర్ణం శుభాంగమ్ ॥**
**లక్ష్మీకాంతం కమలనయనం, యోగిహృద్ధ్యాన గమ్యం ।**
**వందే విష్ణుం భవభయ హరం, సర్వలోకైక నాథమ్ ॥**

తులసీ దళైః పుష్పైశ్చ పూజయామి,

1. ఓం కేశవాయ నమః
2. ఓం నారాయణాయ నమః
3. ఓం మాధవాయ నమః
4. ఓం గోవిన్దాయ నమః
5. ఓం విష్ణవే నమః
6. ఓం మధుసూదనాయ నమః
7. ఓం త్రివిక్రమాయ నమః
8. ఓం వామనాయ నమః
9. ఓం శ్రీధరాయ నమః
10. ఓం హృషీకేశాయ నమః
11. ఓం పద్మనాభాయ నమః
12. ఓం దామోదరాయ నమః
13. ఓం సంకర్షణాయ నమః
14. ఓం వాసుదేవాయ నమః
15. ఓం ప్రద్యుమ్నాయ నమః
16. ఓం అనిరుద్ధాయ నమః
17. ఓం పురుషోత్తమాయ నమః
18. ఓం అధోక్షజాయ నమః
19. ఓం నారసింహాయ నమః
20. ఓం అచ్యుతాయ నమః
21. ఓం జనార్దనాయ నమః
22. ఓం ఉపేంద్రాయ నమః
23. ఓం హరయే నమః
24. ఓం శ్రీ కృష్ణాయ నమః

## శ్రీ వేంకటేశాష్టోత్తర శతనామావళిః

ఓం వేంకటేశాయ నమః
ఓం శేషాద్రి నిలయాయ నమః
ఓం వృషదృగ్గోచరాయ నమః
ఓం విష్ణవే నమః
ఓం సదంజన గిరీశాయ నమః 5
ఓం వృషాద్రిపతయే నమః
ఓం మేరుపుత్ర గిరీశాయ నమః
ఓం సరస్స్వామితటీ జుషే నమః
ఓం కుమారాకల్పసేవ్యాయ నమః
ఓం వజ్రిదృగ్ విషయాయ నమః 10
ఓం సువర్చలాసుతన్యస్త
సైనాపత్య భరాయ నమః
ఓం రామాయ నమః
ఓం పద్మనాభాయ నమః
ఓం సదా వాయుస్తుతాయ నమః
ఓం త్యక్తవైకుణ్ఠ లోకాయ నమః 15
ఓం గిరికుఞ్జ విహారిణే నమః
ఓం హరిచందన గోత్రేన్ద్రస్వామినే నమః
ఓం శంఖరాజన్య నేత్రాబ్జ
విషయాయ నమః
ఓం వసూపరిచర త్రాత్రే నమః
ఓం కృష్ణాయ నమః 20
ఓం అబ్ధికన్యా పరిష్వక్త వక్షసే నమః
ఓం వేంకటాయ నమః
ఓం సనకాది మహాయోగి
పూజితాయ నమః
ఓం దేవజిత్ ప్రముఖానన్త దైత్య సంఘ
ప్రణాశినే నమః
ఓం శ్వేత ద్వీప వసన్ముక్త పూజితాఙ్ఘ్రి
యుగాయ నమః 25
ఓం శేషపర్వత రూపత్వ
ప్రకాశన పరాయ నమః
ఓం సానుస్థాపిత తార్క్ష్యాయ నమః
ఓం తార్క్ష్యాచల నివాసినే నమః
ఓం మాయాగూఢ విమానాయ నమః
ఓం గరుడస్కన్ధ వాసినే నమః 30
ఓం అనంతశిరసే నమః
ఓం అనంతాక్షాయ నమః
ఓం అనంత చరణాయ నమః
ఓం శ్రీశైలనిలయాయ నమః
ఓం దామోదరాయ నమః 35
ఓం నీలమేఘ నిభాయ నమః
ఓం బ్రహ్మాదిదేవ దుర్దర్శ విశ్వ రూపాయ నమః
ఓం వైకుంఠాగత సద్హేమ
విమానాంతర్గతాయ నమః
ఓం అగస్త్యాభ్యర్థి తాశేష జనదృగ్
గ్గోచరాయ నమః





ఓమ్ నమో వేంకటేశాయ! ఓమ్ నమో వేంకటేశాయ! ఓమ్ నమో వేంకటేశాయ! ఓమ్ నమో వేంకటేశాయ!

ఓం వాసుదేవాయ నమః 40
ఓం హరయే నమః
ఓం తీర్థపఞ్చక వాసినే నమః
ఓం వామదేవ ప్రియాయ నమః
ఓం జనకేష్టప్రదాయ నమః
ఓం మార్కండేయ మహాతీర్థ జాత
పుణ్యప్రదాయ నమః 45
ఓం వాక్పతి బ్రహ్మదాత్రే నమః
ఓం చంద్ర లావణ్యదాయినే నమః
ఓం నారాయణనగేశాయ నమః
ఓం బ్రహ్మక్లృప్తోత్సవాయ నమః
ఓం శంఖచక్రవరానమ్ర లసత్ కరతలాయ నమః 50
ఓం ద్రవన్మృగ మదాసక్త విగ్రహాయ నమః
ఓం కేశవాయ నమః
ఓం నిత్య యౌవనమూర్తయే నమః
ఓం అర్థితార్థ ప్రదాత్రే నమః
ఓం విశ్వతీర్థాఘహారిణే నమః 55
ఓం తీర్థస్వామి సరస్స్నాత జనాభీష్ట
ప్రదాయ నమః
ఓం కుమారధారికావాస స్కందా భీష్ట
ప్రదాయినే నమః
ఓం జానుదఘ్నసముద్భూత పోత్రిణేనమః
ఓం కూర్మమూర్తయే నమః
ఓం కిన్నరద్వంద్వ శాపాంత ప్రదాత్రే నమః 60
ఓం విభవే నమః
ఓం వైఖానసమునిశ్రేష్ఠ పూజితాయ నమః
ఓం సింహాచల నివాసాయ నమః
ఓం శ్రీమన్నారాయణాయ నమః
ఓం సద్భక్త నీలకణ్ఠార్చ్య నృసింహాయ నమః 65
ఓం కుముదాక్షగణ శ్రేష్ఠ
సైనాపత్య ప్రదాయ నమః
ఓం దుర్మేధః ప్రాణహర్త్రే నమః
ఓం శ్రీధరాయ నమః
ఓం క్షత్రియాంతక రామాయ నమః
ఓం మత్స్యరూపాయ నమః 70
ఓం పాండవారిప్రహర్త్రే నమః
ఓం శ్రీకరాయ నమః
ఓం ఉపత్యకాప్రదేశస్థ శంకరధ్యాత
మూర్తయే నమః
ఓం రుక్మాబ్జ సరసీకూల లక్ష్మీకృత
తపస్వినే నమః
ఓం సల్లక్ష్మీకరామ్భోజ దత్తకల్హారక స్రజే నమః 75
ఓం సాలగ్రామ నివాసాయ నమః
ఓం శుకదృ గ్గోచరాయ నమః
ఓం నారాయణార్థితా శేషజన
దృగ్విషయాయ నమః
ఓం మృగయా రసికాయ నమః
ఓం వృషభాసుర హారిణే నమః 80
ఓం అంజనాగోత్రపతయే నమః
ఓం వృషభాచల వాసినే నమః
ఓం అంజనాసుత దాత్రే నమః
ఓం మాధవీయాఘహారిణే నమః
ఓం ప్రియఙ్గుప్రియ భక్షాయ నమః 85
ఓం శ్వేతకోలవరాయ నమః
ఓం నీలధేను పయోధారాసేక
దేహోద్భవాయ నమః
ఓం శంకరప్రియ మిత్రాయ నమః
ఓం సుధర్మిణీ సుచైతన్యప్రదాత్రే నమః
ఓం మధుఘాతినే నమః 90
ఓం కృష్ణాఖ్యవిప్ర వేదాంతదేశికత్వ ప్రదాయ నమః
ఓం వరాహాచల నాథాయ నమః
ఓం బలభద్రాయ నమః
ఓం త్రివిక్రమాయ నమః
ఓం మహతే నమః 95
ఓం హృషీకేశాయ నమః
ఓం అచ్యుతాయ నమః
ఓం నీలాద్రినిలయాయ నమః
ఓం క్షీరాబ్ధి నాథాయ నమః
ఓం వైకుంఠాచల వాసినే నమః 100
ఓం ముకున్దాయ నమః

ఓమ్ నమో వేంకటేశాయ! ఓమ్ నమో వేంకటేశాయ! ఓమ్ నమో వేంకటేశాయ! ఓమ్ నమో వేంకటేశాయ!

| | |
|---|---|
| ఓం నిత్యాయ నమః | ఓం హలాయుధ జగత్తీర్థ సమస్త ఫలదాయినే నమః |
| ఓం అనంతాయ నమః | |
| ఓం విరించాభ్యర్థితానీత సౌమ్య రూపాయ నమః | ఓం గోవిన్దాయ నమః |
| ఓం సువర్ణముఖరీ స్నాతమను జాభీష్టదాయినే నమః 105 | ఓం శ్రీనివాసాయ నమః 108 |

❀ ❀ ❀

ఓం శ్రీ మహాలక్ష్మ్యై నమః

ఓం శ్రీ దేవ్యై నమః

ఓం శ్రీ భూదేవ్యై నమః

ఓం శ్రీ నీళాదేవ్యై నమః

ఓం శ్రీ గోదాదేవ్యై నమః

ఓం శ్రీ అనంతాయ నమః

ఓం శ్రీ గరుడాయ నమః

ఓం శ్రీమతే విష్వక్సేనాయ నమః

ఓం శ్రీ పరాంకుశాయ నమః

ఓం శ్రీమతే రామానుజాయ నమః

ఓం శ్రీమద్వరవరమునయే నమః

ఓం స్వాచార్యేభ్యో నమః

ఓం పూర్వాచార్యేభ్యో నమః

సమస్త సరివారాయ సర్వ దివ్యమంగళ విగ్రహాయ శ్రీమతే నారాయణాయ నమః

శ్రీనివాస పరబ్రహ్మణే నమః

ధూపమాఘ్రాపయామి, చక్కని పరిమళము కల్గిన అగరువత్తులను వెలిగించి స్వామికి చూపండి

శ్రీనివాస పరబ్రహ్మణే నమః

దీపం సందర్శయామి, దీపమును వెలిగించి స్వామికి చూపండి.

శ్రీనివాస పరబ్రహ్మణే నమః

శుద్ధ ఆచమనీయం సమర్పయామి.

పెరుమాళ్ళ ముందు స్థలమును శుద్ధిచేసి ప్రసాదమును ఫలాదులను అన్నిటినీ ఉంచి





శ్రీనివాస పరబ్రహ్మణే నమః

నైవేద్యం సమర్పయామి

ప్రసాదమును ప్రోక్షించి, తులసి ఉంచి, సురభిముద్రను చూపి మృగముద్రతో ఆరగింపు చేయాలి.

పాయసాన్నం గూడాన్నంచ ముద్గాన్నం శుద్ధమోదనమ్ ।
దధి క్షీరాజ్య సంపృక్తం నానా శాక ఫలాన్వితమ్ ॥

అపూపాన్ వివిధాన్ స్వాదూన్ శాలి పిష్టోపపాదితాన్
పృథుకాన్ గుడసమ్మిశ్రాన్ సజీరక మరీచికాన్ ॥

అన్నం చతుర్విధం జ్ఞేయం క్షీరాన్నం ఘృత శర్కరమ్ ।
పంచధా షడ్రసోపేతం గృహాణ మధుసూదన ॥

యా ప్రీతి ర్విదురార్పితే, మురరిపో! కుంత్యర్పితే యాదృశీ,
యా గోవర్ధనమూర్ధ్ని, యాచ పృథుకే, స్తన్యే యశోదార్పితే ।
భారద్వాజ సమర్పితే, శబరికాదత్తేఽ ధరే యోషితాం
యా ప్రీతి ర్మునిపత్ని భక్తిరచితేఽ ప్యత్రాపి తాం తాం కురు ॥

'ఓం ఓం ఓం' అని ఉచ్చరిస్తూ ప్రసాద నివేదన పూర్తిచేయాలి)

శ్రీనివాస పరబ్రహ్మణే నమః

మధ్యే మధ్యే పానీయం సమర్పయామి

శ్రీనివాస పరబ్రహ్మణే నమః

హస్తౌ ప్రక్షాళయామి, పాదౌ ప్రక్షాళయామి.

గండూషణం సమర్పయామి.

(పుక్కిలించు తీర్థము నందించండి.)

శ్రీనివాస పరబ్రహ్మణే నమః

తాంబూలం సమర్పయామి

శ్రీనివాస పరబ్రహ్మణే నమః

మంగళ నీరాజనం సమర్పయామి.

హారతి వెలిగించి నిల్చొని స్వామికి చూపండి.

శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేఽర్థినామ్ ।
శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥
లక్ష్మీచరణ లాక్షాంక సాక్షి శ్రీవత్సవక్షసే ।
క్షేమం కరాయ సర్వేషాం శ్రీరంగేశాయ మంగళమ్ ॥
అస్తు శ్రీస్తన కస్తూరీ వాసనా వాసితోరసే ।
శ్రీహస్తిగిరి నాథాయ దేవరాజాయ మంగళమ్ ॥
కమలా కుచ కస్తూరీ కర్ద మాంకిత వక్షసే ।
యాదవాద్రి నివాసాయ సంపత్ పుత్రాయ మంగళమ్ ॥

నీలాచల నివాసాయ నిత్యాయ పరమాత్మనే ।
సుభద్రా ప్రాణనాథాయ జగన్నాథాయ మంగళమ్ ॥

స్వోచ్ఛిష్ట మాలికా బంధ గంధబంధుర జిష్ణవే ।
విష్ణుచిత్త తనూజాయై గోదాయై నిత్యమంగళమ్ ॥

శ్రీనగర్యాం మహాపుర్యాం తామ్రపర్ణ్యు త్తరే తటే ।
శ్రీ తింత్రిణీ మూలధామ్నే శఠకోపాయ మంగళమ్ ॥

శేషో వా సైన్యనాథోవా శ్రీపతి ర్వేతి సాత్వికైః ।
వితర్క్యాయ మహాప్రాజ్ఞైః భాష్యకారాయ మంగళమ్ ॥

తులా మూలావతీర్ణాయ తోషితాఖిల సూరయే ।
సౌమ్యజామాతృ మునయే శేషాంశాయాస్తు మంగళమ్ ॥
మంగళాశాసనపరైః మదాచార్య పురోగమైః ।
సర్వైశ్చ పూర్వై రాచార్యైః సత్కృతాయాస్తు మంగళమ్ ॥

శ్రీనివాస పరబ్రహ్మణే నమః
అర్ఘ్యం సమర్పయామి, పాద్యం సమర్పయామి,
ఆచమనీయం సమర్పయామి
శ్రీనివాస పరబ్రహ్మణే నమః సువర్ణ మంత్రపుష్పం సమర్పయామి,
శ్రీనివాస పరబ్రహ్మణే నమః
చామరోపచారం సమర్పయామి.





# శ్రీ వేంకటేశ్వర గోవింద నామములు

శ్రీ శ్రీనివాసా గోవిందా
శ్రీ వేంకటేశా గోవిందా
భక్తవత్సలా గోవిందా
భాగవతప్రియ గోవిందా
నిత్యనిర్మలా గోవిందా
నీలమేఘనిభ గోవిందా
పురాణపురుష గోవిందా
పుండరీకాక్ష గోవిందా
**గోవిందా హరి గోవిందా!**
**గోకులనందన గోవిందా!!**
నవనీత చోర గోవిందా
పశుపాలక శ్రీ గోవిందా
పాపవిమోచన గోవిందా
దుష్టసంహార గోవిందా
దురిత నివారణ గోవిందా
శిష్టపాలక గోవిందా
కష్టనివారణ గోవిందా
వజ్రమకుటధర గోవిందా॥ ॥గోవిందా హరి॥
వరాహమూర్తీ గోవిందా
గోపీజనప్రియ గోవిందా
గోవర్ధనధర గోవిందా
దశరథనందన గోవిందా
దశముఖ మర్దన గోవిందా
పక్షివాహన గోవిందా
పాండవప్రియ గోవిందా
మత్స్యకూర్మధర గోవిందా ॥గోవిందా హరి॥
వరాహ నృసింహ గోవిందా
వామన భార్గవ గోవిందా

బలరామానుజ గోవిందా
బౌద్ధకల్కిహరి గోవిందా
మధుసూదనహరి గోవిందా
వేంకటరమణా గోవిందా
సీతానాయక గోవిందా
శ్రితపరిపాలక గోవిందా ॥గోవిందా హరి॥
శ్రితజనపోషక గోవిందా
ధర్మస్థాపక గోవిందా
అనాథ రక్షక గోవిందా
ఆపద్బాంధవ గోవిందా
శరణాగతభృత గోవిందా
కరుణాసాగర గోవిందా
కమలదళాక్ష గోవిందా
కామితఫలదా గోవిందా ॥గోవిందా హరి॥
పాపవినాశక గోవిందా
పాహి మురారే గోవిందా
శ్రీముద్రాంకిత గోవిందా
శ్రీవత్సాంకిత గోవిందా
ధరణీనాయక గోవిందా
దినకరతేజా గోవిందా
పద్మావతీప్రియ గోవిందా
ప్రసన్నమూర్తీ గోవిందా ॥గోవిందా హరి॥
అభయహస్తధర గోవిందా
మర్త్యావతార గోవిందా
శంఖచక్రధర గోవిందా
శార్ఙ్గగదాధర గోవిందా
విరజాపారగ గోవిందా
విరోధిమర్దన గోవిందా

సాలగ్రామధర గోవిందా
సహస్రనామ గోవిందా ॥గోవిందా హరి॥
లక్ష్మీవల్లభ గోవిందా
లక్ష్మణాగ్రజ గోవిందా
కస్తూరితిలక గోవిందా
స్వర్ణవస్త్రధర గోవిందా
గరుడవాహన గోవిందా
వానరసేవిత గోవిందా
సేతుబంధన గోవిందా
సప్తగిరీశ గోవిందా ॥గోవిందా హరి॥
ఏకస్వరూప గోవిందా
ఏకపత్నీవ్రత గోవిందా
రఘుకులనందన గోవిందా
ప్రత్యక్షదేవ గోవిందా
పరమదయాకర గోవిందా
వజ్రకవచధర గోవిందా
కౌస్తుభ శోభిత గోవిందా
కుమారార్చిత గోవిందా ॥గోవిందా హరి॥
వసుదేవస్తుత గోవిందా
బిల్వపత్రార్చిత గోవిందా
భిక్షుక సంస్తుత గోవిందా
బ్రహ్మాండరూప గోవిందా
భక్త రక్షక గోవిందా
నిత్యకళ్యాణ గోవిందా
నీరజనాభ గోవిందా
గజేంద్రరూప గోవిందా ॥గోవిందా హరి॥
హరిసర్వోత్తమ గోవిందా
జగత్స్వరూప గోవిందా

జనహృన్నివాస గోవిందా
అభిషేకప్రియ గోవిందా
రామానుజనుత గోవిందా
రత్నమకుటధర గోవిందా
అనంతసేవిత గోవిందా
ఆశ్రితవత్సల గోవిందా ॥గోవిందా హరి॥
నిత్యశుభప్రద గోవిందా
నిఖిలలోకేశ గోవిందా
ఆనందరూప గోవిందా
ఆద్యంతరహిత గోవిందా
ఇహపరదాయక గోవిందా
ఇభరాజరక్షక గోవిందా
పరమదయాళో గోవిందా
పద్మనాభ హరి గోవిందా ॥గోవిందా హరి॥
తిరుమలవాస గోవిందా
తులసీ సేవిత గోవిందా
శేషాద్రినిలయ గోవిందా
శ్రీనివాస శ్రీ గోవిందా
శ్రీ వేంకటేశ గోవిందా
విఖనసార్చిత గోవిందా
భాష్యకారప్రియ గోవిందా
ఊర్ధ్వపుండ్రధర గోవిందా ॥గోవిందా హరి॥
ఆనంద విమాన గోవిందా
రంగనాథసఖ గోవిందా
తాతార్పిత జల గోవిందా
(స్వామి) పుష్కరిణి ప్రియ గోవిందా

**గోవిందా హరి గోవిందా!**

**గోకులనందన గోవిందా!!**





హారతి వెలిగించి స్వామికి చూపుతూ ఈ పాశురము విన్నవించవలెను.

పల్లాణ్డు పల్లాణ్డు పల్లాయిరత్తాణ్డు, పలకోడి నూఱాయిరమ్
మల్లాణ్డ తిణ్డోళ్ మణివణ్ణా, ఉన్ శేవడి శెవ్వి తిరుక్కాప్పు ।
అడియోమోడుం నిన్నోడుం పిరివిన్ఱి ఆయిరం పల్లాణ్డు,
వడివాయ్ నిన్ వలమార్బినిల్వాழ் గిన్ఱ మంగైయుం పల్లాణ్డు
వడివార్ శోది వలత్తుఱైయుం శుడరాழியుంపల్లాణ్డు,
పడైపోర్ పుక్కు ముழுజ్ఞుం అప్పాఞ్చశన్నియముం పల్లాణ్డే

శ్రీనివాస పరబ్రహ్మణే నమః
అర్ఘ్యం సమర్పయామి, పాద్యం సమర్పయామి,

(పెరుమాళ్ళను తిరిగి మందిరం లోనికి చేర్చి, మనసులోనికి ఆహ్వానించి నిల్పొని దేశ సుభిక్షతకై, లోకశాంతికై ప్రార్ధన చేసి, క్షమా ప్రార్థన చేయండి)

మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం జనార్దన ।
యత్కృతం తు మయా దేవ! పరిపూర్ణం తదస్తు తే ॥

ఉపచారాపదేశేన కృతా నహ రహర్మయా ।
అపచారా నిమాన్ సర్వాన్ క్షమస్వ పురుషోత్తమ! ॥

స్వస్తిప్రజాభ్యః పరిపాలయన్తాం
న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః ।
గోబ్రాహ్మణేభ్య శ్శుభమస్తు నిత్యం
లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు ॥

కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ ।
దేశోఽయం క్షోభరహితః బ్రాహ్మణా స్సన్తు నిర్భయాః॥

కావేరీ వర్ధతాం కాలే కాలే వర్షతు వాసవః ।
శ్రీరంగనాథో జయతు శ్రీరంగ శ్రీశ్చ వర్ధతామ్ ॥

కాయేన వాచా మనసేంద్రియైర్వా
బుద్ధ్యాత్మనా వా ప్రకృతే స్స్వభావాత్ ।
కరోమి యద్యత్ సకలం పరస్మై
నారాయణాయేతి సమర్పయామి ॥

శ్రీమన్నారాయణేతి సమర్పయామి॥
శ్రీనివాస పరబ్రహ్మణే నమః
పర్యంకాసనం సమర్పయామి

పెరుమాళ్ళకు శయనోత్సవము చేయండి.
పన్నగాధీశ పర్యంకే రమాహస్తోపధానకే
సుఖం శేష్వ వృషాద్రీశ! సుదర్శన సురక్షితః ॥

శంఖచక్ర గదాఖడ్గ దివ్యాయుధ గణ స్తథా
శ్రీశ రక్షా ధానాయ సదా జాగృత! జాగృత! ॥

## హనుమ ప్రార్థన

మనోజవం మారుత తుల్యవేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్ ।
వాతాత్మజం వానరయూథముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి ॥

ఉల్లంఘ్య సింధోః సలిలం సలీలం
య శ్శోక వహ్నిం జనకాత్మజాయాః ।
ఆదాయ తేనైవ దదాహ లంకాం
నమామి తం ప్రాంజలి రాంజనేయమ్ ॥